● కేసీఆర్‌ను కలిసిన జగదీష్‌రెడ్డి



కేసీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న జగదీష్‌రెడ్డి, తదితరులు

సమయానికి లేక.. సర్వేకు ఇక్కట్లు

- ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు అందుబాటులో ఉండని కొందరు దరఖాస్తుదారులు
- గ్రామాల్లో వలస వెళ్లిన వారి వివరాల సేకరణకు ఇబ్బందులు

అర్వపల్లి : ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సర్వే ఇంకా కొనసాగుతోంది. అయితే ఈ సర్వేకు కొందరు దరఖాస్తుదారులు అందుబాటులో లేక అధికారులు, ఎన్యుమరేటర్లు నానాపాట్లు పడుతున్నారు. చాలా మంది దరఖాస్తుదారులు ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లి అక్కడే ఉంటూ పనులు చేసుకుంటున్నారు. అయితే సర్వే డిసెంబర్ నెలాఖరుతో పూర్తయినప్పటికీ ఇంకా అనేకమంది దరఖాస్తుదారులు అందుబాటులో లేక సర్వేను పొడిగించారు.



జాజిరెడ్డిగూడెంలో దరఖాస్తుదారుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్

7,954 ఇళ్ల సర్వే పూర్తి..

జాజిరెడ్డిగూడెం మండలంలో గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇళ్ల కోసం 9,070 దరఖాస్తులు వచ్చాయి. అయితే వాటిలో నుంచి ఇప్పటివరకు 7,954 దరఖాస్తుల సర్వే పూర్తయింది. వివరాలను ఎన్యుమరేటర్లు ఇందిరమ్మ మొబైల్ యాప్‌లో నమోదు చేసుకున్నారు. మండలంలో మొత్తం ఇప్పటి వరకు 87.7 శాతం సర్వే జరిగింది. ఇంకా మిగిలిన దరఖాస్తుదారులు సర్వే చేయించుకోవాల్సి ఉంది. కాగా సర్వే సందర్భంగా ఎన్యుమరేటర్లు దరఖాస్తుదారులకు ఇళ్లు ఉందా లేదా, కుటుంబంలో ఎవరిపేరిట ఉంది, లబ్ధిదారుల పేరిట ఖాళీ స్థలం ఉందా లేదా, వారు ఆర్థికంగా వెనకబడి ఉన్నారా అనే తదితర వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం నివాసం ఉండే ఇల్లు లేదా ఖాళీ స్థలం వద్ద వారి ఫొటోలు తీసుకుంటున్నారు. పట్టణాలలో ఉన్న దరఖాస్తుదారులు వెంటనే గ్రామాలకు వచ్చి సర్వే చేయించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

అధికారులు సర్వే చేశారు



మాకు ఇల్లు లేకపోవడంతో ప్రజాపాలనలో దరఖాస్తు చేశాను. అధికారులు ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల సర్వే సందర్భంగా నాకు ఉన్న ఖాళీ స్థలం వద్ద ఫొటో తీసుకున్నారు. నా భర్త చనిపోయాడు. మా కుటుంబానికి ఇల్లు మంజూరు చేస్తే నాకున్న స్థలంలో ఇంటిని నిర్మించుకుంటాను.

– ఎస్‌కె.మైబూబీ, రామన్నగూడెం

దరఖాస్తుదారులు అందుబాటులో ఉండాలి



ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా సర్వే సందర్భంగా తమ ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలి. కొంతమంది దరఖాస్తుదారులు ఉపాధికోసం పట్టణాలకు వెళ్లారు. వారు అందుబాటులో లేక సర్వేను సకాలంలో పూర్తి చేయలేకపోతున్నాం. మిగిలిన వారు వెంటనే ఆయా గ్రామాలకు చేరుకొని సర్వే చేయించుకోవాలి.

– సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



నాగారంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేల్

నాగారం : గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం నాగారం మండల కేంద్రంలో క్రాంతి యువజన సంఘం 25వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువకులు, విద్యార్థులు క్రీడలతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. క్రాంతి యువజన సంఘం విద్యా, వైద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కడియం పరమేశ్వర్, కడారి యాదవరెడ్డి, కన్నెబోయిన వెంకటభిక్షం, మంగదుడ్ల దశరథ, నాతి వీరమల్లు, చిప్పలపల్లి మల్సూర్, యలమకంటి సోమయ్య, ఆకుల ప్రతాప్, సాయికుమార్, క్రాంతి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్పలపల్లి విక్రం, అధ్యక్షుడు చిప్పలపల్లి చిరంజీవి, వెంకన్న, ఉపేందర్, దేవరకొండ మురళి, చంద్రశేఖర్, మల్లేష్, గిరి, రామకృష్ణ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సీఎం సహాయనిధిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. శనివారం నాగారంలో మండలానికి చెందిన ఏడుగురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.3,60,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, అధ్యక్షుడు తొడుసు లింగయ్య, కడారి యాదవరెడ్డి, కన్నెబోయిన వెంకటభిక్షం, మంగదుడ్ల దశరథ, ఆకుల ప్రతాప్, మల్లేష్ పాక యాకయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని వినతి

అర్వపల్లి : అర్వపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సీతారాంపురంనకు విద్యుత్ సరఫరాకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయించాలని కోరుతూ సీతారాంపురం గ్రామస్తులు శనివారం తిరుమలగిరిలో ఎమ్మెల్యే సామేల్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం అర్వపల్లి సబ్‌స్టేషన్ నుంచి పర్సాయపల్లి–బొల్లంపల్లి ఫీడర్ ద్వారా తమ గ్రామానికి విద్యుత్ సరఫరా అవుతుండటంతో ఆయా గ్రామాల్లో ఏ చిన్న సమస్య ఏర్పడినా తమ గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయి రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. తమ గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న అర్వపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి లైన్ వేసి 24 గంటలు విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు బైరబోయిన మహరాజు, సైదులు, గ్రామస్తులు అంకిరెడ్డి ప్రశాంత్, కుర్రె శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే సామేల్‌ను తిరుమలగిరిలో శనివారం కలిశారు. మండల కేంద్రం నుంచి వెంకెపల్లి వరకు రోడ్డు అభివృద్ధి పనులను చేపట్టాలని, గ్రామంలో కట్టు కాల్వను ఆధునీకరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కో ఆర్డినేటర్ బాణాల సుదర్శన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బత్తుల నాగమల్లు, బాణాల సత్యనారాయణరెడ్డి, ఏర్పుగొండ సురేష్, బాణాల మల్లారెడ్డి, బత్తుల సురేష్, పులుసు సైదులు, బత్తుల మల్లయ్య, రవి, బత్తుల రవి, వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



నూతనకల్ : ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

క్లుప్తంగా

నైపుణ్యాల వెలికితీతకే ప్రతిభా పోటీలు

సూర్యాపేట టౌన్: విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాల వెలికితీసేందుకు ప్రతిభాపోటీలు దోహదపడతాయని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు దేవరశెట్టి జనార్దన్, శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాల భవన్‌లో తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవ పరీక్షలను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో వివిధ ఫోరమ్‌ల సభ్యులు ఇలాంటి పోటీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు సీహెచ్.వెంకటేశ్వర్లు, వెంకటయ్య, మేరిల, సైదులు పాల్గొన్నారు.

డీఎస్పీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రవి

పెన్‌పహాడ్ : నేరాల అదుపునకు చర్యలు చేపట్టాలని డీఎస్పీ రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దాలని తెలిపారు. సమాజంలో అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలను భాగస్వాములు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ గోపికృష్ణ, ఏఎస్‌ఐ రాములు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపిక

తుంగతుర్తి : మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని కె.కావ్యశ్రీ ఇటీవల నిర్వహించిన మండల స్థాయి ఒలింపియాడ్ క్రీడల్లో ప్రథమ బహుమతి సాధించి జిల్లా స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఎంఈఓ బోయిని లింగయ్య విద్యార్థికి ప్రశంసా పత్రం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కవిత, పీఈటీ అంబేద్కర్, ఉపాధ్యాయులు రవీందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బోర ప్రసన్న తృతీయ బహుమతి గెలుచుకుంది. జిల్లా వ్యాప్తంగా 23 మండలాలకు చెందిన సుమారు 200 మంది పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణ భవానికి సావిత్రిబాయి ఫూలే అవార్డు



అవార్డు అందుకుంటున్న కృష్ణ భవాని

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న సావిత్రిబాయి పూలే అవార్డు తిరుమలగిరికి చెందిన పోలీస్ శాఖలో పని చేస్తున్న కృష్ణ భవానికి దక్కింది. శనివారం ఆమె హైదరాబాద్‌లో అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ మణిమంజరి, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

నూతనకల్ : ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కొంత మందికి మాత్రమే మాఫీ చేశారని అన్నారు. రుణమాఫీ చేయకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతుల నుంచి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యానాల వెంకట్‌రెడ్డి, మద్దెల రామ్మూర్తి, లింగయ్య పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

అర్వపల్లి : కుంచమర్తి గ్రామానికి చెందిన మహంకాళి లింగస్వామి అనారోగ్యానికి గురికావడంతో వైద్యఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రూ.2.50లక్షలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరు కాగా ఎల్‌ఓసీ కాపీని శనివారం లింగస్వామికి డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ అమీనుద్దీన్, టి. మధు, పి. దేవేందర్, ఎం. రాంబాబు, ఎండీ. అజమ్, జి. సంకేష్, ఎం. వీరస్వామి, ఎం. రాఘునాథ్ పాల్గొన్నారు.

కమిటీ నియామకంలో జాప్యం తగదు

చివ్వెంల : శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ఆలయ కమిటీ నియామకంలో జాప్యం తగదని బీఆర్‌ఎస్ లీగల్ సెల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, పెద్దగట్టు మాజీ డైరెక్టర్ జటంగి వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. నెల రోజుల్లో జాతర సమీపిస్తున్నా ఇంతవరకు అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 30 లక్షల మంది భక్తులు జాతరకు హాజరవుతారని, ఐదు రోజుల పాటు జరిగే జాతరకు స్థలం లేక ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ప్రతి జాతరకు తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పెద్దగట్టు అభివృద్ధికి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జాతర అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ్ యాదవ్, మల్లేష్ యాదవ్, నర్సయ్య యాదవ్, బక్కయ్య యాదవ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దిరాల : రెడ్డిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మద్దిరాల, మద్దిరాల క్రాస్‌రోడ్డు, కుంటపల్లి గ్రామాల్లో, అదే విధంగా దిర్శనపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని చిన్న నెమిల గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్న 1గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ఇళ్ల సర్వేకు సహకరించాలి

అర్వపల్లి : ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీఓ టి.గోపి కోరారు. శనివారం జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, రామన్నగూడెం తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. మండలంలో గతేడాది నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో 9,070 దరఖాస్తులు రాగా దరఖాస్తుదారుల ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. అందుబాటులో లేనివారు ఇప్పటికైనా సర్వే చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు నవీన్‌రెడ్డి, మాగి నాగయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీల నిరసన



తుంగతుర్తిలో మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న సివిల్ సప్లయ్ హమాలీ సంఘం నాయకులు

తుంగతుర్తి : సివిల్ సప్లయ్ హమాలీలకు పెంచిన కూలి రేట్ల జీఓను అమలు చేయాలని సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొంకూరి శ్యామ్‌సుందర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రాజారామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో యూనియన్ ఆధ్వర్యంలో సివిల్ సప్లయ్ గోదాం ఎదుట నిరవధిక సమ్మెలో భాగంగా మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీలు ఎం.వెంకన్న, లక్ష్మయ్య, వీరస్వామి, అవిలయ్య, ఎల్లయ్య, సురేష్, రవి, రమేష్, వెంకన్న, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



తిరుమలగిరి: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే



అర్వపల్లి: క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించడానికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో పీఆర్‌టీయూ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, కార్యదర్శి తీగల నరేష్, తిరుమలగిరి మండల శాఖ అధ్యక్షుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భూక్యా లక్ష్మణ్, విశ్రాంత ఉపాధ్యాయులు కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో..

అర్వపల్లి : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ టీఎస్ ముందుండి పోరాడటం అభినందనీయమని ఎంఈఓ బాలునాయక్ అన్నారు. అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం పీఆర్‌టీయూ టీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో అతిపెద్దదైన పీఆర్‌టీయూ సంఘం విద్యాభివృద్ధికి కృషిచేయాలని కోరారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉల్లెందుల సైదులు, జలగం పురుషోత్తంల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, తీగల నరేష్, హెచ్‌ఎం ఎం.విజయలక్ష్మి, అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.ధర్మయ్య, డి.యల్లయ్య, చంద్రారెడ్డి, రమేష్, శంకర్, పీడీ పి.మల్లేష్, వి.మధుకర్, ఆర్.సైదులు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎంఈఓ బి. బాలునాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి నోముల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఫజల్‌ఖాన్, రమేష్, మల్లిక, రజిని, సైదులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ

చివ్వెంల : టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రమణ, జిల్లా కార్యదర్శి చిలక రమేష్, మండల ప్రధాన కార్యదర్శి బోడ దయాకర్, బి.వీరస్వామి, ఎన్. శంకర్, పల్లె అనిల్ కుమార్, జె.క్రాంతి ప్రభ, డి.శ్రీనివాస్ నాయక్, ఎస్‌కే నజీర్, ఎం.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో..



చివ్వెంల : జెడ్పీహెచ్‌ఎస్‌లో..

సంక్షిప్త సమాచారం

అభివృద్ధికి సహకరించాలి

అర్వపల్లి : అర్వపల్లి గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని మండల పంచాయతీ అధికారి టి.గోపి కోరారు. 60రోజులకు ఒకసారి నిర్వహించే గ్రామ సభను శనివారం అర్వపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఇతర సమస్యలపై చర్చించారు. పలు తీర్మానాలు చేశారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కూడా గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.నవీన్‌రెడ్డి, బిల్ కలెక్టర్ యాగానందం, అంగన్‌వాడీ టీచర్లు నవనీత, సునంద, ఆశాకార్యకర్తలు స్వరూప, అరుణ, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలకు విరాళం అందజేత

తుంగతుర్తి : మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోదాదేవి, రంగానాథస్వామి కల్యాణ మహోత్సవానికి మండల కేంద్రానికి చెందిన పూసపల్లి యాదగిరి–కళ్యాణి దంపతులు శనివారం రూ.12,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అర్చకుడు రామాచార్యులు విరాళం అందజేసిన దాతలను అభినందించారు.

గండూరి కృపాకర్ జన్మదిన వేడుకలు

సూర్యాపేట : బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్ జన్మదిన వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కేక్ కట్ చేసి కృపాకర్‌కు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు మాతృవియోగం

ఆత్మకూర్ (ఎస్) : మండల ప్రాథమిక సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు కొణతం సత్యనారాయణ రెడ్డి మాతృమూర్తి కొణతం సరోజినమ్మ(88) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందారు. కాగా మండలకేంద్రంలో ఆమె భౌతిక కాయానికి పలువురు బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు.

డీజేపీఆర్ కాంట్రాక్టును రద్దు చేయాలి

భానుపురి : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో నిర్మాణ పనులు చేపడుతున్న డీజేపీఆర్ కాంట్రాక్టు సంస్థపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జనరల్ హాస్పిటల్‌లో మాతాశిశు విభాగం వద్ద డీజేపీఆర్ సంస్థ ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా నిర్మాణం చేపట్టడంతో అక్కడ ఉండే సహాయకుల మీద రాళ్లు, దుమ్ము పడి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పైఅంతస్తులో నుంచి వ్యర్థాలు కిందకు పడవేయడం వల్ల వెనుక ఉన్న బిల్డింగ్‌లోకి వెళ్లే రోగులు, ప్రజల కళ్లలో పడి ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్పిటల్ సూపరింటెండెంట్, వైద్య శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే ఆ సంస్థ అనుమతులు రద్దు చేసి, నిర్మాణం జరిగే ప్రదేశంలో రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సోమవారం హాస్పిటల్ దగ్గర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

16న వర్ధమానుకోటలో యానాల వీరారెడ్డి వర్ధంతి సభ

నూతనకల్ : పీడీఎస్‌యూ నాయకుడు యానాల వీరారెడ్డి 34వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని బీటీసీ జిల్లా అధ్యక్షుడు దేసోజు మధు కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 16న వర్ధమానుకోటలో సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు మున్నా అశోక్, ఉప్పుల మణి, దగ్గుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయం



ఆత్మకూర్ (ఎస్) : విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అధికారులు



మద్దిరాలలో విద్యార్థులకు రీడింగ్ చైర్లను అందజేస్తున్న తహసీల్దార్



పెన్‌పహాడ్‌లోని పాఠశాలలో గ్రీన్ బోర్డును ప్రారంభిస్తున్న ఎంఈఓ రవి, దాత మట్టపల్లిరావు



పెన్‌పహాడ్ : విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డీపీఓ నారాయణరెడ్డి

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన నేలవల్లి మట్టపల్లిరావు తన తల్లి లక్ష్మమ్మ జ్ఞాపకార్థం రూ.లక్షా 10వేల విలువ చేసే కంప్యూటర్, ఆరు గ్రీన్ బోర్డ్స్, మూడు బీరువాలు అందజేశారు. అనంతరం దాత మట్టపల్లిరావు మాట్లాడారు. పదో తరగతిలో మంచి గ్రేడ్ పాయింట్స్ సాధించిన వారిని తన సొంత ఖర్చులతో పైచదువులు చదివిస్తానని ప్రకటించారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు రంగినేని లక్ష్మీకాంతరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతల సహకారం సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులు దాతలు అందిస్తున్న సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో దాత సాయిమణికంఠ అందజేసిన దుప్పట్లను విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. హాస్టళ్లలో విద్యార్థులకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీఓ సంజీవయ్య, ఏబీసీడబ్ల్యూఓ గామయ్య, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు సైదులు, గిరిధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : ప్రభుత్వ విద్యా వ్యవస్థ అభివృద్ధి కోసం స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు సహకారం అందించడం అభినందనీయమని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కాకి కృపాకర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏకమల్లు సేకరించిన దుప్పట్లను మోడల్ స్కూల్‌లో శనివారం హాస్టల్ విద్యార్థినులకు పంపిణీ చేశారు. అనంతరం హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ధారాసింగ్, డీసీడీఓ పూలన్, జేఏసీ చైర్మన్ భూపతి రాములు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏకమల్లు పాల్గొన్నారు.

మద్దిరాల : 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో తమ సత్తా చాటాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు తన సొంత ఖర్చులతో రీడింగ్ చైర్లను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తండు వెంకటనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



సైన్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచిన జయ పాఠశాల విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలో జిల్లా కేంద్రంలోని జయ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల నుంచి 29 మంది విద్యార్థులు రెండవ లెవల్‌కు అర్హత సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరెస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. 5వ తరగతి నుంచి ఏడుగురు, 6వ తరగతి నుంచి ఐదుగురు, 7వ తరగతి నుంచి ఏడుగురు, 8వ తరగతి నుంచి ఇద్దరు, 9వ తరగతి నుంచి ముగ్గురు, 10వ తరగతి నుంచి ఐదు మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు చెప్పారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్‌తోపాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

ధనుర్మాస పూజలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం 20వ రోజు స్వామి, అమ్మవార్లకు వస్త్రోత్సవ కార్యక్రమం జరిపారు. మహిళలు మంగళహారతులతో గోదాదేవికి కుంకుమార్చన నిర్వహించారు. పసుపు కొట్టే సన్నివేశాన్ని, నాయకి నాయకను నిర్వహించారు. భక్తి గీతాలు ఆలపించి పారాయణం పఠించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని తుంగతుర్తి మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పూజారి కాటూరి రామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.